

# సూర్య

www.suryaa.com

**ఏలూరు జిల్లా పశ్చిమ గోదావరి జిల్లా**

శనివారం,19 జులై 2025

8 పేజీలు


### పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై

# సిఎం దిశా నిర్దేశం





### ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి

**అమరావతి/ఏలూరు,సూర్యబ్యూరో** : ఈనెల 21 నుంచి జరిగే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ప్రధానంగా ప్రస్తావించాల్సిన అంశాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారని

- తరువాయి 2లో..

# ప్రజారోగ్యం పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలి

### : జిల్లా కలెక్టర్





**ఆకివీడు,మేజర్‌న్యూస్** : ఆకివీడు నగరంలోని అణాల చెరువు,దొరవారి చెరువు,ధర్మాపురం చెరువు,కొండయ్య చెరువులను శుక్రవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేస్తూ కొండయ్య చెరువు, దొరవారి చెరువుల పూడిక తీత పనులు పూర్తిచేసి త్రాగునీటి చెరువులుగా వినియోగంలో తీసుకురావాలని సూచించారు. అవకాశం ఉన్న చెరువుగట్లపై ఫెన్సింగ్ వేసి వాకింగ్ ట్రాక్, పూల మొక్కలను నాటి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటి చెరువులను కలుషితం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ప్రజారోగ్యం విషయంలో రాజీ ఉండదన్నారు. ప్రతి ఒక్కరూ మానవీయ కోణంలో ఆలోచించి త్రాగునీటి వనరులను కలుషితం చేయడంగాని, ఎవరైనా చేస్తున్న కూడా అడ్డగించి ఫిర్యాదు చేయాలని తెలిపారు. చాలా అనారోగ్య సమస్యలు త్రాగునీటి వనరులు కలుషితం

- తరువాయి 2లో..

# ఇళ్ల నిర్మాణాల ప్రగతి సాధించాలి

- లక్ష్యాలు సాధించేందుకు రానున్న 12 రోజులు ఎంతో కీలకం
- పనితీరు కనబరిచిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సత్కరిస్తాం



**ఏలూరు,మేజర్‌న్యూస్** : జిల్లాలో ఇళ్లనిర్మాణాలను వేగవంతం చేసి మంచి ప్రగతిచూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహనిర్మాణ శాఖ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణ ప్రగతి తీరును జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను సాధించేందుకు రానున్న 12 రోజులు ఎంతో కీలకమన్నారు. రూఫ్ లెవల్, రూఫ్ కాస్ట్ స్థాయికి చేరుకున్నఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తిచేసేందుకు సంబంధిత లబ్దిదారులను అవగాహన పరచాలన్నారు. ఇప్పటికే పనులు పూర్తయిన ఇళ్లకు సంబంధించి సొమ్ము ప్రభుత్వం

- తరువాయి 2లో..

# మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలు పట్టవా ?

–గిరిజన శాఖ మంత్రి తొలి పర్యటనలోనే ఏజెన్సీని విస్మరించిన సంధ్యారాణి



**కొయ్యలగూడెం,మేజర్‌న్యూస్** : కూటమి ప్రభుత్వం ఏర్పడి యేడాది గడిచింది.. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఏలూరు జిల్లాలోని ఏజెన్సీ గిరిజన గ్రామల సందర్శనకు గానీ, ఐటిడిఏ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పరిశీలించడానికి గానీఈ ఏడాది కాలంలో ఒక్కసారి కూడా రాకపోవడం, ఈ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. తాజాగా, సుపరిపాలన తొలి అడుగు 4.1 కార్యక్రమంలో భాగంగా కొయ్యలగూడెంలోని ఏకలవ్య కాలనీకి వస్తున్నారు. మైదానప్రాంతంలోని గిరిజనలను

- తరువాయి 2లో..



# మంచినీళ్ల కోసం మహిళల ధర్నా

**పోడూరు,మేజర్‌న్యూస్:** మండలంలో కవిటం లాకులు వద్ద నల్ల వెంకయ్య చెరువు గ్రామస్తులు మంచినీటి కోసంధర్నా నిర్వహించారు, ఓవర్ హెడ్ ట్యాంక్ శుభ్రపరిచే నిమిత్తం మూడు రోజులు పనులు చేయడం వలన గ్రామంలో పంచాయతీ అధికారులు టామ్ టామ్ వేయించారు, అయితే మూడు రోజులు అనంతరం మంచినీళ్లు రావడానికి ఆలస్యం కావడంతో గ్రామంలో గల మహిళలు ప్రధాన కూడలి వద్ద బిందెలతో ధర్నాలు నిర్వహించారు,దీంతో ట్రాఫిక్కుకు తీవ్ర అంతరాయం కలిగింది, సుమారు 200 కుటుంబాలు నివసించే ఈ కాలనీ వాసులు ధర్నా చేయడంతో పంచాయతీ అధికారులు దిగివచ్చి పాలకొల్లు నుండి వెయ్యి లీటర్ల

- తరువాయి 2లో..

# ఎస్టి రిజర్వేషన్ మార్చి ఓసికి ఇవ్వటం అన్యాయం కాదా?

భీమవరం ఏఎంసీ చైర్మన్ పదవి ఒకరోజు ఎస్టి,
మరో రోజు ఓసి ఎలా అవుతుంది?
రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రశ్నించిన వక్తలు



**భీమవరం,మేజర్‌న్యూస్** :భీమవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఎస్టి మహిళకు కేటాయించి,మరుసటి రోజున ఓసి మహిళకు ఇవ్వటాన్ని గిరిజన సంఘాలు, మేధావులు అధికారుల వైఖరిని తప్పు పట్టారు. ఈ విషయమై శుక్రవారం స్థానిక అంబేద్కర్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న, వైసిపి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జ్ గూడూరి ఉమాబాల, భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి చినిమిల్లి వెంకట రాయుడు తదితరులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఎస్సీ, ఎస్టీ బీసీలను అణగ తొక్కుతూ ఉన్నదని, వారికి రావలసిన హక్కులను కాలరాస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. భీమవరం ఏఎంసీ చైర్మన్ పదవికి సంబంధించి ఈనెల 8వ తేదీన ఎస్టి మహిళకు కేటాయిస్తున్నట్టు

- తరువాయి 2లో..

# మైదాన ప్రాంత గిరిజనుల సమస్యలు పట్టవా ?

మొదటిపేజి తరువాయి

కలుసుకోవాలని రావటం సంతోషమే. అయితే,ఈ కొయ్యలగూడెం మండలంలోనే 8 మైదాన ప్రాంత గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆ గ్రామాలలో సుమారు 4వేల మంది కోయ (గిరిజన తెగ) జాతి ప్రజలు నివశిస్తున్నారు. సరిపల్లి పంచాయతీ (రెవెన్యూ గ్రామం) పరిధిలో వంకబొత్తప్పగూడెం, మర్రిగూడెం గ్రామాలు, దిప్పకాయల పాడు పంచాయతీలో కిచ్చప్పగూడెం,తంగెళ్ళగూడెం, బిల్లిమిల్లి గ్రామాలు, మంగపతిదేవిపేట పంచాయతీ బుల్లెంపేట గ్రామం,బోడిగూడెం పంచాయతీలో బుల్లెంపేట గ్రామాల్లో స్వచ్ఛమైన కోయజాతి గిరిజనులు నివశిస్తున్నారు.ఈగ్రామాలను పాలకులు ఎవరూ పట్టించుకోవడంలేదు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ఆగ్రామాల్లోని ప్రజలను ఓటు వేయబోమని ఉద్యమాలు చేయడం, ప్రభుత్వ ఉన్నతాధికారులు వచ్చి వారిని సముదాయించి, హామీలు ఇవ్వడం పరిపాటిగా మారింది. 2001లో ఒక దినపత్రికలో వచ్చిన కథనం 'సబ్-ప్లాన్ లో లేవట - సర్కారుకు పట్టవట' శీర్షిక సమాచారాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ పూనెం మాలకొండయ్య చూచి,ఆ ఏడాది ఫిబ్రవరిలో అన్ని శాఖల జిల్లా అధికారులతో కలిసి వంకబొత్తప్పగూడెం గ్రామానికి వచ్చారు. జిల్లాలో మూడు మండలాల్లో ఉన్న మైదాన ప్రాంత గిరిజనులను అందరినీ అక్కడకు రప్పించి,అక్కడ సమావేశమయ్యారు.వారి సమస్యలు తెలుసుకున్నారు.కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపారు.మిగిలిన వాటికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని చెప్పారు.మైదాన ప్రాంత కోయ జాతి గిరిజనులు అందరూ ముక్తకంఠంతో తమ గ్రామాలను కూడా ఏజెన్సీ సబ్-ప్లాన్ పరిధిలో చేర్చాలని,తమకు కూడా సబ్-ప్లాన్ ఏరియాలో ఉన్న గిరిజనులకు అందించే అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తమకు అందించాలని కోరారు. ఈ విషయమై అప్పటి కలెక్టర్ మాట్లాడుతూ ఈ సమస్యకు పరిష్కారం కేంద్రప్రభుత్వమే శ్రద్ధ చూపాలని పార్లమెంటు, కేంద్ర గిరిజన సంక్షేమ సబ్-కమిటీ సభ్యులు చర్చించి, రాష్ట్రపతి ఆమోదంతో అమోదం కోసం పంపితే అప్పుడు సమస్య పరిష్కారం అవుతుందని కలెక్టర్ చెప్పారు. ఈ సమస్యపై ఐటిడిఏ పాలకవర్గ సమావేశంలో తీర్మానం ఆమోదించి,రాష్ట్ర ప్రభుత్వానికి పంపుతామని ఆమె వివరించారు.నాటి నుండి నేటి వరకూ ఆ సమస్యకు పరిష్కారం లభించక పోవడం గమనార్హం. ప్రస్తుతం మంత్రి సంధ్యారాణి మండలంలోని మైదాన ప్రాంత గిరిజన గ్రామాలకు వచ్చి, తమను పలకరిస్తారని ఆశించామని, కొయ్యలగూడెం నుంచి మంత్రి వెళుతున్నట్టు పర్యటన కార్యక్రమం రూపొందించడం పట్ల తమకు తీవ్ర ఆవేదన కలుగుతుందని గిరిజన మహిళలు వాపోయారు.

## ఇళ్ల నిర్మాణాల ప్రగతి సాధించాలి

మొదటిపేజి తరువాయి

జమ చేసివుందని, తదుపరి పనులు పూర్తిచేస్తే వెంటనే చెల్లింపులు జరుగుతాయన్నారు.ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించి మంచి ప్రగతి చూపాలన్నారు.ఈ విషయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వచ్చేవారంనాటికి మంచి ప్రణాళికతో ఇళ్లనిర్మాణాల్లోపురోగతికనబరిచేలా కృషిచేయాల న్నారు. ఈ విషయంలో మంచి ప్రగతి చూపిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను గుర్తించి సత్కరించడం జరుగుతుందన్నారు .ఏలూరు,ఉంగుటూరు, మండవల్లి, కైకలూరు తదితర మండలాల్లో ఇళ్లనిర్మాణాల ప్రగతి వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా వర్షాకాలం సీజన్ ను దృష్టిలో ఉంచుకొని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాల న్నారు. ఇదే సమయంలో నిల్వచేసిన ఇసుక, ఇతర నిర్మాణ సామాగ్రి అవకతవకలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవా లన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు అందినా సంబంధిత సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుం దని కలెక్టర్ స్పష్టంచేశారు. సమావేశంలో జిల్లా హౌసింగ్ అధికారి జి.వి.వి.సత్యనారాయణ, గృహ నిర్మాణశాఖ ఈఈలు, డిఈలు, ఏఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ సూచించారు.ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయం నుండి రక్షణ పొందవచ్చుని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని, అతివేగంగా వాహనాలు నడపరాదని హితవు పలికారు. వేగం వద్దు - ప్రాణం ముద్దు అనే నినాదాన్ని గుర్తుంచుకోవాలని ఆయన కోరారు.ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ముందు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని అన్నారు.విజిబుల్ పోలీసింగ్ సందర్భంగా ద్విచక్ర వాహనాలు నడుపుతున్న మైనర్ లను వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు.మైనర్ల కు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే నష్టాలను వారికి వివరించారు.ఈ విజిబుల్ పోలీసింగ్ మరియు అవగాహన కార్యక్రమం ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడానికి మరియు నేరాలను నివారించడానికి దోహదం చేస్తుందని ఎస్ఐ శుభ శేఖర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## వైసిపి ఆధ్వర్యంలో బాబు షూరిటీ - మోసం గ్యారంటీ

**- పాల్గొన్న మాజీ మంత్రి శ్రీరంగనాథ రాజు,జిల్లా అధ్యక్షులు ముదునూరి**




**పోడూరు,మేజర్ న్యూస్** : తూర్పు పాలెం క్యాంప్ ఆఫీస్ లో వైసర్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమన్ని రాష్ట్ర మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథ రాజు నిర్వహించారు,ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జిల్లా ప్రెసిడెంట్ ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు గూడూరి ఉమా బాల, కౌరు శ్రీనివాస్,ముదునూరి మురళి కృష్ణం రాజు, కండవల్లి వాష్ పాల్గొని కార్యక్రమాన్ని ముందుకు నడిపారు, బాబు షూరిటీ మోసం గ్యారంటీఈకార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృత ప్రచారం చేస్తామని రంగరాజ అన్నారు, ఇస్తామన్న పథకాలుఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు, జగన్మోహన్‌రెడ్డి పెట్టిన పథకాలను కూడా అమలపరచకుండా తీసేసారని అన్నారు,ఇసుక అక్రమంగా తరలిస్తున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీ, సర్పంచ్ లు, వివిధ పదవులు చెందిన నాయకులు ఆచంట నియోజకవర్గ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా కూటమి సుస్థిరపాలన

**- ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడి**





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుస్థిరపాలనకు నాంది పలికిందని ఎమ్మెల్యే బడేటి చంటి ఉద్ఘాటించారు. ప్రజా చైతన్యంతోనే మంచి పరిపాలనకు కొనసాగింపు మరింత సాధ్యమవుతోందని అభిప్రాయపడ్డారు.శుక్రవారం సాయంత్రం స్థానిక 39వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్ళి ప్రజా సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తూ,సుపరిపాలనను కొనసాగిస్తున్నట్లు చెప్పారు.ముఖ్యంగా గడిచిన ఏడాదికాలంలో ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాల లబ్దిని అర్హులకు కల్పించిన ఘనతను ప్రభుత్వం సొంతం చేసుకుందన్నారు. ఇదేక్రమంలో ప్రజలంతా ప్రభుత్వ పాలనపై పూర్తిస్థాయిలో అవగాహనను పెంపొందించు కోవాల్సిన అవసరం ఉందనీ ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి,డిప్యూటి మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు,నగర టిడిపి అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కో- ఆప్షన్ సభ్యులు ఎస్సెమ్మార్ పెదబాబు, మాజీ కౌన్సిలర్‌బెల్లపుకొండకిషోర్,పలివెల లవకిషోర్, డివిజన్ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై సిఎం దిశా నిర్దేశం

మొదటిపేజి తరువాయి

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో కేంద్ర మంత్రులు, సహచర ఎంపీలతో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన నిధులు కేంద్ర నుంచి రాబట్టేలా లోక్ సభలో ప్రస్తావించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తగు సూచనలు చేశారని ఎంపీ తెలిపారు. పార్లమెంట్‌వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రస్తావించాల్సిన అంశాలు, వ్యూహాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రధానంగాచర్చించినట్లుఎంపీ పేర్కొన్నా రు. ముఖ్యంగా ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి రైల్వే, ఎన్.హెచ్, ఇతర సమస్యలను లోక్ సభలో ప్రస్తావించి, కేంద్రం నుంచి సాధ్యమైనన్ని ఎక్కువ నిధులు రాబట్టేందుకు తన వంతు కృషి చేస్తానని ఎంపీ స్పష్టం చేశారు.

## ప్రజారోగ్యం పట్ల ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలి

మొదటిపేజి తరువాయి

వల్లే వస్తాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. త్రాగునీటి వనరులు కలుషితం వలన క్యాన్సర్ వంటి రోగాలతో ఎంతోమంది బాధితులుగా ఉన్నారని గుర్తించుకోవాలన్నారు. తాగునీటి చెరువుల చుట్టూ ఆక్రమించుకొని వారి ఇళ్లల్లోని సెప్టిక్ వ్యర్థాలను తాగునీటి చెరువుల్లోకి మళ్లించడం హేయమైనా చర్య అన్నారు.సమాజంలో ఉన్నది మన ఒక్కరమే కాదని, మనం చేసే పొరపాట్లకు ఇతరులు అనారోగ్యం కలగడం సరైనదేనా అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరు సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, అప్పుడే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకోగలుగుతా మన్నారు. ఈ సందర్భంలో ఆకివీడు నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్, తహసిల్దార్ ఎన్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో ఇ. మార్కండేశ్వర రావు, తదితరులు ఉన్నారు.

## మంచినీళ్ల కోసం మహిళల ధర్నా

మొదటిపేజి తరువాయి

సామర్థ్యం గల వాటర్ ట్యాంకర్ ను రప్పించే విధంగా చర్యలు చేపట్టడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

## ఎస్టి రిజర్వేషన్ మార్చి ఓసికి ఇవ్వటం అన్యాయం కాదా?

మొదటిపేజి తరువాయి

జిల్లా కలెక్టర్ జీవో ఎమ్మెస్ నెంబర్ 77 ఇవ్వటం జరిగిందని, మరుసటి రోజున చైర్మన్ పదవి ఓసి మహిళకు మార్చడం జరిగిందని అన్నారు.ఈ విషయంపై న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం గిరిజన నాయకుడు సాలా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు మేడిది జాన్సన్, పట్టణ వైసిపి అధ్యక్షులు గాదిరాజు రామరాజు,దళిత జేఏసీ నాయకులు గంటా సుందర్ కుమార్ తదితరులు మాట్లాడుతూ

గిరిజనులకు జరిగిన అన్యాయాన్ని వ్యతిరేకిస్తూ కూటమి ప్రభుత్వం గిరిజనులను గుర్తించడంలో విఫలమైందని, గిరిజన సంఘాలకు అండగా ఉంటామని అన్నారు. గిరిజనులను అవమానిస్తూ ఇచ్చిన జీవోను మార్చి ఓసి మహిళకు కేటాయించడంతో పాటుగా పాలకమండలిని ఏర్పాటు చేయటం దుర్మార్గమని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వంలో ఎస్టీ వర్గాల వారు రాజకీయ పదవులకు అర్హులు కాదా అని ప్రశ్నించారు. వారి పక్కన ఎస్టీ మహిళను కూర్చో బెట్టుకోవడానికి అవమానకరంగా భావించి జీవోను మార్చారని, కూటమి ప్రభుత్వం,అధికార యంత్రాంగం భూస్వామి భావజాలంతో ముందుకెళ్తుందని, చిన్న వర్గాల అణ గదొక్కటమే ప్రధాన ఎజెండాగా తీసుకున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తారని పెంద్ర వీరన్న అన్నారు. యధావిధిగా రిజర్వేషన్ కొనసాగించి ఎస్టి మహిళకు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భారతి విజయరాజు, వైసిపి ఎస్టి జిల్లా ప్రధాన కార్యదర్శి బండి రమేష్, కుతాడ పెద్ద సత్యనారాయణ, సాల వెంకటేశ్వరరావు, కారంపూడి అనంత నాగు, బండి రాంబాబు,బండి వెంకటేశ్వరావు, సేనాపతి పొట్టియ, సాలా నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారులకు భూసేకరణ చేయాలి





**వేగవంతంగా నిర్మాణాలు – అధికారులు మనస్సు పెట్టి పని చేయాలి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం జాతీయ రహదారులకు,ఇండస్ట్రియల్ పార్కులకు భూసేకరణ, నిర్మాణాలు వేగవంతంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి,జిల్లా జాయింటు కలెక్టరు పి.ధాత్రిరెడ్డి సంయుక్తంగా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంతం చేసి నిర్మాణాలు పూర్తి చేసి ప్రజలకు వాడుకులోకి తీసుకురావాలన్నారు. కాలయాపనలు చేస్తే అభివృద్ధి పనులు కుంటుపడతాయని అటువంటి అధికారులను గుర్తించి బాధ్యులను చేస్తామని అన్నారు. కైకలూరు బైపాస్ ఏనిమిది కిలోమీటర్లు పనులకు నాలుగు కిలోమీటర్లు పూర్తి అయ్యాయని మిగిలిన పనులు వేగవంతం చెయ్యాలని అన్నారు.టెండర్లు ప్రక్రియ పనులు పూర్తి చేసి పనులు మొదలు పెట్టాలని సూచించారు. కోర్టు కేసులు పెండింగులుపై ప్రత్యేకదృష్టి పెట్టి కేసులు పరిష్కారం అయ్యేలా చూసి అభివృద్ధి పనులకు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబధించి రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను జిల్లా కలెక్టరు ఆదేశించారు.

ఎంఎస్ఎంఈ పార్కులకు ఈ నెలాఖరికి భూ సేకరణ పూర్తి చెయ్యాలి – ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామివేత్తను రూపొందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'వన్ ఫ్యామిలీ. వన్ ఎంటర్ప్రెన్యూర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధిలో నిలిపేందుకు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎం ఈ పార్కులు ఏర్పాటుకు నిర్మాణాలు శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. అందుకు అనుగుణంగా ఈ నెల చివరినాటికి ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటుకు అవసరమేనా భూసేకరణ పూర్తి చెయ్యాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాలు వారీగా భూసేకరణ పనులను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలవరం నియోజకవర్గంలో తాడువాయి గ్రామంలో 30 ఏకరాలు భూమికి ప్రపోజల్స్ వెనువెంటనే పంపించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రైవేటు ల్యాండును భూ సేకరణ చేయాలని,ఇందుకు గ్రామ సభలు నిర్వహించి అవగాహన కల్పించి,ఆయా రైతులను మనసు గెలిచి ఒప్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, నూజివీడు సబ్ కలెక్టరు బచ్చు స్వరణ్ రాజ్,జంగారెడ్డి గూడెం ఆర్డీవో యం.వి.రమణ,జాతీయ రహదారులు అధికారులు, సంబంధిత అధికారులు, తహాశీల్దార్లు,కాంట్రాక్టర్లు, తదితరులు, పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**– నూజివీడు డిఎస్పి ప్రసాద్**



**పెదవేగి,మేజర్‌న్యూస్:** చట్టాలపై విద్యార్థులకు చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండాలని నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ అన్నారు.శుక్రవారం పెదవేగి మండలం ఎంఆర్సి కాలనీలోనీ అంబేద్కర్ గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. నూజివీడు డిఎస్పి కె వి వి ఎన్ వి ప్రసాద్ మార్గదర్శనంలో పెదవేగి సీఐ చి. రాజశేఖర్, ఎస్ఐ రామకృష్ణ నాయకత్వంలో పెదవేగి సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా డిఎస్పి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని సైబర్ నేరాలు,మోసపూరిత కాల్స్, సోషల్ మీడియా మోసాలపై తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. అదేవిధంగా రోడ్డు భద్రత,హెల్మెట్, సీటు బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ నిబంధనలు కూడా వివరించారు.మైనర్ డ్రైవింగ్ చేయటం చట్ట విరుద్ధమని దాని వల్ల సంభవించే ప్రమాదాలు, చట్టపరమైన శిక్షలు కూడా విద్యార్థులు తెలియజేశారు.ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ చట్టం మరియు పోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం సమాజాన్ని యువతను పట్టిపీడిస్తున్న గంజాయి, మారకద్రవ్యాల వల్ల సమాజంలో జరుగుతున్న నష్టాన్ని విద్యార్థులకు వివరించి దాని నివారణకు తీసుకోవాల్సిన చర్యలను తెలిపారు. గంజాయి వ్యవస్థ నివారణ కోసం 1972 హెల్ప్ లైన్ కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంట రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్సై రామకృష్ణ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూములు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేసిన వీరవాసరం రైతులు

**– ఎన్ హెచ్ 165 భూసేకరణపై జేసి రాహుల్ కుమార్ సమావేశం**



**వీరవాసరం,మేజర్ న్యూస్ :** జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా వీరవాసరం గ్రామ రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై శుక్రవారం వీరవాసరం తహసిల్దార్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ చేపట్టడం జరిగింది. భూసేకరణపై జూన్ 14 న అభ్యంతరాలు గడువు ముగియడంతో, వీరవాసరం గ్రామానికి చెందిన18 మంది రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై ఈరోజు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్మెంట్, తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.అలైన్మెంట్ మార్పు తమ పరిధిలోనిది కాదని, నష్టపరి హారం విషయంలో సర్వే నంబర్ ప్రకారం సమీప ప్రాంతాలలో గత మూడు సంవత్సరాలగా జరిగిన లావాదేవీలను చూసి సరాసరిన ప్రభుత్వ నిబంధన ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు.తమ భూములను ప్రభుత్వానికి అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని కాకపోతే తాము నష్టపోకుండా హెచ్చు మొత్తములో న్యాయమైన నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా ఇప్పించాలని జాయింట్ కలెక్టరును రైతులు కోరారు. అలాగే అలైన్మెంట్ ఏ సర్వే నెంబర్ నుండి వెళ్తుంది అనే వివరాలను రైతులు కోరగా, త్వరలో క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలను అందజేస్తామని తెలిపారు. ఈ విచారణలో ఎన్.హెచ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ అండ్ బి ఎన్.శ్రీనివాస్ రావు,తాహసిల్దార్ ఏ వి రామాంజనేయులు,సబ్ రిజిస్టర్ ఎన్.కమల కుమారి,కలెక్టరేట్ ల్యాండ్ సూపటెండెంట్ సి హెచ్ రవికుమార్,డిటి జి.కళ్యాణి,పాల్గొన్నారు.

## జనసేన 17వ డివిజన్ ఇంచార్జీగా కిరణ్, అధ్యక్షుడిగా శ్రీధర్




**ఏలూరు,మేజర్ న్యూస్ :** నగరంలోని 17వ డివిజన్‌కు జనసేన పార్టీ నూతన డివిజన్ కమిటీని శుక్రవారం నియమించింది. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ రెడ్డి అప్పల నాయుడు ఆదేశాల మేరకు ఈ నియామకాలు జరిగాయి. ఈ సందర్భంగా లక్కింశెట్టి కిరణ్ కుమార్ డివిజన్ ఇంచార్జీగా, సుంకర శ్రీధర్ ను డివిజన్ అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా చాగంటి దుర్గా పవన్, సుంకర లక్ష్మణరావు, సెక్రటరీగా గోవాడ ద్వారక, ట్రెజరర్ బడే రాజారావు, సమన్వయకర్తగా సముద్రాల కృష్ణ మోహన్, అధికార ప్రతినిధులుగా మెరుపు నాగరాజు, పోలిశెట్టి రాజేష్, జాయింట్ సెక్రటరీగా రామినేని నాని,జంగా గోపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా పసుపులేటి రాజా, ప్రచార కార్యదర్శిగా వల్లూరు వంశీ కృష్ణ ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరంనూతన డివిజన్ ఇంచార్జీ లక్కింశెట్టి కిరణ్ కుమార్ అధ్యక్షతన జనసేన పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించి,డివిజన్ కమిటీ, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయాన్ని సునిశ్చితం చేయాలన్న సంకల్పంతో కార్యక్రమాల అమలుపై చర్చించారు. స్థానిక సమస్యలను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించారు.

## కళాకారులకు రాయల్ క్లబ్ సత్కారం



**నర్సాపురం, మేజర్ న్యూస్:** స్థానిక వై ఎన్ కళాశాల ఆడిటోరి యంలో జరిగిన చత్రపతి శివాజీ మహారాజు నటీ నటులను స్థానిక రాయల్ క్లబ్ సభ్యులు సత్కరించారు.శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు జక్కం బాబ్జి, పోలిశెట్టి గణేశ్వరరావులు మాట్లాడుతూ వేలమంది కళాభిమానులు ఈనాటికను తిలకించారని, ఆధునిక ప్రపంచంలో నాటికలకు ఉన్న ఆదరణ మరువలేనిది అన్నారు. ఈ సందర్భంగా నటులను రాయల్ క్లబ్ తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యంతో పాటు, పలువురు రాయల్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## వార్ఫ్ రోడ్డు నందు సుపరిపాలనలో ముందడుగు



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** తాడేపల్లిగూడెం పట్టణం 26వవార్డు వార్ఫ్ రోడ్డు నందు సబ్నివేసు కృష్ణమోహన్, షేక్ బాజీ , వార్డు ప్రెసిడెంట్ నిఖిల్ ఆధ్వర్యంలో సుపరిపాలన లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి, పట్టణ అధ్యక్షులు పట్నాల రాంపండు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి పలువురు నాయకులు పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకుని పాలన, పథకాలు బాబ్జి వివరిస్తూ వచ్చారు. ఈ కార్యక్రమంలో మునగపాటి పరుశురాం, సిలివెంక టాచలం, కిలాడి సాయి, దలై తిరుమల రావు, మొండెం లీల, తెలుగుదేశం పార్టీ యూనిట్, బూత్ ఇన్చార్జిలు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వేగవంతంగా కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు





**– పర్యాటక కేంద్రాలు,ప్రభుత్వ వసతి గృహాల్లో పూర్తి చేయాలి**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాలు ప్రగతిపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మండలాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో 258 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరు అయ్యాయని నిర్మాణాలు వేగవంతం చేసి,విద్యార్థులకు, పర్యాటకులకు వాడుకలోకి తీసుకురావాలని అన్నారు. ఇంకా మొదలుపెట్టని చోట టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను వెనువెంటనే మొదలు పెట్టాలన్నారు.ఒక్కో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు రూ.3 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని, పనులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని అన్నారు. పనులు నాణ్యత విషయంలో నిర్లక్ష్యం,అలసత్వం వహిస్తే అటువంటి అధికారులను గుర్తించి బాధ్యులను చేస్తామని అన్నారు. గత కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి తలుపులు,విద్యుత్తు, వాటరు కనెక్షన్లు పరిశీలన చేసి,చిన్న చిన్న రిపేర్లు ఉంటే పూర్తి చేయాలన్నారు. అంగన్వాడి సెంటర్లో చిన్నారులను దృష్టిలో పెట్టుకుని టాయిలెట్స్ విషయంలో మొదటి ప్రాధా న్యత ఇవ్వాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్ డబ్ల్యూ ఎస్ యస్ఇ జి.త్రినాథబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్ రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి ఆర్.వి.నాగరాణి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్ జిల్లా కో-ఆర్డినేటరు ఉమాదేవి, జిల్లా టూరిజం మేనేజరు యస్.పట్టాభిరామన్న, ఇంజనీరింగు అధికారులు,పాల్గొన్నారు.

# నరసాపురంలో నూతన ఫిషింగ్ హార్బర్ నిర్మాణం చేయాలి

**సబ్ కలెక్టర్ దాసి రాజుకి వినతి పత్రం అందజేసిన**
**జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు**
**ముద్దాడ గణేష్ భవాని యాదవ్**



**నరసాపురం,మేజర్‌న్యూస్ :**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర విభజనలో భాగంగా తీరప్రాంత ప్రజలకు అండగా అగ్ని కుల క్షత్రియులు,అన్ని కులాలు అన్ని మతాలకు అనుగుణంగా ఉన్న నరసాపురం మండలంలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్ కృష్ణయ్య జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆర్డీవో దాసి రాజుకు వినతి పత్రం అందజేశారు. గత 100 సంవత్సరాల క్రితం నుండి డివిజన్, పార్లమెంటు ప్రదేశంగా కొనసాగుతున్న నరసాపురం తీరప్రాంతములో ఏర్పాటు చెయ్యవలసిన ఫిషింగ్ హార్బర్ ను వెంటనే నిర్మాణం చేయాలని ఇక్కడ ఉన్న వ్యాపార. వాణిజ్యం. విద్య .సామాజిక అభివృద్ధి జరగాలి అంటే కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తీరప్రాంత ప్రజలను ఆదుకోవాలి అని వినతి పత్రంలో పేర్కొన్నారు. బడుగు బలహీన ఉన్నత వర్గాలకు.. న్యాయం చేసి .ఇప్పటి కూటమి ప్రభుత్వం డెల్టా ప్రాంతాని సుందర నందనవనముగా తయారు చేయాలి అని రాష్ట్ర ప్రభుత్వాని కోరారు.అటు కృష్ణా జిల్లా,ఇటు అంబేద్కర్ కోనసీమ జిల్లాల మధ్య పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఉండటం మూడు జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉంది కాబట్టి ఎంత తీవ్రంగా నష్టపోయినా తీరప్రాంత ప్రజలకు ఫిషింగ్ హార్బర్ చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014 నుండి ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్న తీరప్రాంత నీ కోస్టల్ కారిడార్ గా తీసుకొనిఎన్నో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు అని ఈ సందర్భంగా గణేష్ భవాని యాదవ్ గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 85 శాతం పైబడి ఉన్న బి.సి. ఎస్.సి, ఎస్.టి . మైనార్టీ.. కుల వృత్తులు, చేతి వృత్తులు, సంచార జీవితాలు గుడుపుతున్నటువంటి కుటుంబాలలో పూట గడవడమే కష్టంగా ఉంది. ఇటువంటి పరిస్థితులలో ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు.భావితరాలకు బాసట అవుతుంది అని నేటి ప్రధానమంత్రి నరేంద్రమోడి గారు విప్లవాత్మకమైనటువంటి మార్పులు తీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో పెమ్మడి మోహన్ లాల్,గొర్ల దుర్గారావు (పీడీ), గవర కోర్పరేషన్ మాజీ డైరెక్టర్. బోడెటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు రైల్వే స్టేషన్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** ఏలూరు రైల్వే స్టేషన్ 1వ నెంబర్ ప్లాట్ఫారం వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే పోలీసులు ప్లాట్ఫామ్ వద్దకు వెళ్లి చూడగా అతని వద్ద ఆధారాలు ఏమీ లభించలేదు. తెలుపు గులాబీ రంగు చొక్కా,నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు.

ఇతని గురించి సమాచారం తెలిసినవారు రైల్వే ఎస్సై సైమన్ 9989219559 నెంబర్‌కు సంప్రదించాలని సూచించారు. కేసు నమోదుచేసి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

# ఎమ్మెల్యేను కలిసిన నూతన ఎఎంసి చైర్మన్ సుజాత

**మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేయాలి : ఎమ్మెల్యే అంజిబాబు సూచన**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** మార్కెట్ యార్డ్‌ను మరింత అభివృద్ధి చేయడంతోపాటు లాభాల బాటలో తీసుకెళ్లేందుకు కృషి చేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్,ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా నియమితులైన భీమవరం ఎఎంసి చైర్మన్ కలిదిండి సుజాత రామచంద్రరాజు దంపతులు ఎమ్మెల్యే అంజిబాబును కలిశారు. కూటమి ప్రభుత్వంలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఎఎంసి చైర్మన్ సుజాత రామచంద్ర రాజు మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని, మార్కెట్ కమిటీని కూడా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తమపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు బాధ్యతగా రైతు సంక్షేమం, అభివృద్ధికి మార్కెట్ యార్డ్ ల అన్నదాతలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా కృషి చేస్తానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన కూటమి అధిష్టానానికి, కూటమి నాయకులకు, పార్టీ పెద్దలకు,కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని అన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# నేడు కొయ్యలగూడెంలో మంత్రి సంధ్యారాణి పర్యటన




**కొయ్యలగూడెం,మేజర్ న్యూస్ :** ఇంటింటికి తెలుగు దేశం సుపరిపాలనలో తొలిగి అడుగు 4.1లో భాగంగా రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం కొయ్యలగూడెంలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. కొయ్యలగూడెంలోని ఏకలవ్య కాలనీలో మంత్రి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, వారికి అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు అందుతున్న పథకాలు, ప్రయెజనాల గురించి ప్రజలను అడిగి తెలుసుకుంటారు. ఉదయం 10.30 ని.లకు మంత్రి కొయ్యలగూడెం రానున్నారు. 10-45కు ఏకలవ్య కాలనీకి,స్థానిక కూటమి ప్రభుత్వ నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికి వెళతారు. మధ్యాహ్నం 12 గం.లకు తిరుగు ప్రయాణమై మంత్రి ఏలూరు వెళతారు. అక్కడ కలక్టరేట్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ కార్యక్రమాలు అమలుపై ఆయా శాఖల అధికారులతో సమీక్షిస్తారు.ఏకలవ్య కాలనీకి వెళ్లే మార్గంలోనూ, కాలనీలో దెబ్బతిన్న వీధి రోడ్లను ప్రొక్లెయినర్ తీసుకువెళ్లి సరిచేస్తున్నారు. హొడావిడిగా సాయంత్రం 4 గం.లకు ఈ పనులు అధికారులు చేపట్టారు.

## రాజుగారి తోట, లక్కు వారి తోటలలో సుపరిపాలన



నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ : మండలంలోని రాజు గారి తోట గ్రామం, మొగల్తూరు మండలం లక్కువారి తోటలలో శుక్రవారం సుపరిపాలనతొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు,రాష్ట్ర మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజులు హాజరయ్యారు. ఇంటింటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలు, ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వాతాడి ఉమా మహేశ్వరరావు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

## 2023 డీఎస్సీ ఉపాధ్యాయులకు,ఉద్యోగులకు పాత పెన్షన్ ఇవ్వాలి



**ఏలూరు,మేజర్ న్యూస్ :** 2023 డీఎస్సీ ద్వారా ఉద్యో గంలో చేరిన ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు, కేంద్ర ప్రభుత్వ మెమో నెంబర్ 57 ద్వారా పాత పెన్షన్‌ని అమలు చేయాలని వైయస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ డిమాండ్ చేశారు. భారతదేశంలో సుమారు 16 రాష్ట్రాలు ఇప్పటికే మెమో నెంబర్ 57 అమలు చేస్తూ పాత పెన్షన్ పునరుద్ధరించడం జరిగిందన్నారు. అదేవిధంగా భారతీయ రైల్వే,తంతి తపాలా,కొన్ని కేంద్రప్రభుత్వ సంస్థలు పాత పెన్షన్ పునరుద్ధరించడం జరిగిందని,రాష్ట్రంలోని కూటమిప్రభుత్వం కూడా మీనమేషాలు లెక్కించకుండా వెంటనే న్యాయమైన ఈ సమస్యను పరిష్కరించి 2023లో ఉద్యోగంలోచేరిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ పునరుద్ధరించాలని వైఎస్ఆర్ టీచర్ అసోసియేషన్ తరఫున డిమాండ్ చేస్తూ,2023 ఉపాధ్యాయుల పోరాటానికి పూర్తి మద్దతు ఇవ్వడం జరుగుతుందని సుధీర్ తెలిపారు.

# శ్రీ వై.యన్.బి.యిడి కళాశాలలో ముగిసిన టియల్‌యం వర్కషాప్



**నరసాపురం,మేజర్‌న్యూస్ :**స్థానిక శ్రీ వై.యన్. బి.యిడి కళాశాలలో రెండు రోజుల టి యల్ యం (బోధనోపకరణాల కార్యశాల) వర్కషాప్ శుక్రవారంతో ముగిసింది.ఈ వర్కషాప్ ముగింపు సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డా పిట్టా శాంతి అధ్యక్షతన వహించగా ముఖ్య అతిధిగా శ్రీ వై.యన్ బి.యిడి కళాశాల కరస్పాండెంట్ కానూరి స్వామినాయుడు, ఆత్మీయ అతిధులుగా శ్రీ వై.యన్ కళాశాల ట్రెజరర్ పోలిశెట్టి శ్రీ రఘురామ రావు, డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ హాజరయ్యారు. స్వామినాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం విద్యావిధానంలో నాణ్యమైన విద్య కొరవడిందనికాబోయే గురువులైన మీవంటి వారిద్వారా మంచి విద్య అందించబడాలన్నారు. బోధనోపకరణాల ద్వారా విద్యాబోధన జరిగినట్లయితే విద్యార్థులు శారీరక,మానసికవికాసాన్ని పొందుతారన్నారు. విద్యార్థులు చదువును ఎలా నేర్చుకోవాలి,గురువులు ఎలా బోధించాలి, ఒకరినొకరు ఎలా గౌరవించుకోవాలో తెలుసుకుంటే చదువు యొక్క సార్ధకత నెరవేరినట్లేనన్నారు.ప్రాచీన కాలంలో ఏ పుస్తకాలు లేకుండా విద్యాభ్యాసం కొనసాగినప్పుడు సమాజంలో గౌరవమర్యాదలు తారా స్థాయిలో ఉండేవని నేడు శాస్త్రసాంకేతిక రంగాలను శాసించే స్థాయికి మనిషి ఎదిగినప్పుడు మానవతా విలువలు లోపిస్తున్నాయని ఇటువంటి లోపాలను సరిచేయవలసిన బాధ్యత గురువులపై ఉందన్నారు.ట్రెజరర్ పోలిశెట్టి శ్రీ రఘురామ రావు మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు సమాజానికి విద్యతో పాటు వినయం,సంస్కారం నేర్పినప్పుడే జీవితాలకు అర్ధం పరమార్ధం లభిస్తుందన్నారు.డీన్ ప్రొఫెసర్ గంధం శ్రీరామకృష్ణ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు నిరంతరం సాధన,వృత్తి పట్ల అంకితభావం కలిగిఉంటే ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని తెలియజేసారు.అనంతరం అధ్యాపకులు, ఛాత్రోపాధ్యా యులు అతిధులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముత్యాల కళ్యాణ్అధ్యాపకులు జి రాధ ,సి హెచ్ రుద్రమదేవి ,సి హెచ్ వరలక్ష్మి అధ్యాపకేతర సిబ్బంది ప్రసాద్, ధనుంజయ,శ్రీనివాస్, పార్వతి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళకు కృత్రిమ కాలు అమరిక



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ–గన్నవరం యూనిట్ ఆర్థిక సహకారముతో గన్నవరం కు చెందిన కొనకళ్ళ రామతులసి కిశుక్రవారం కృత్రిమ కాలు అందచేసినట్లు హీల్ సంస్థ సి.ఈ.ఓ. కూరపాటి అజయ్ కుమార్ తెలిపారు. మండలం పరిధి తోటపల్లి గ్రామంలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ మరియు గన్నవరం మానవతా యూనిట్ అధ్యక్షులు వీసం ప్రసాదరావు చేతుల మీదుగా కృత్రిమ కాలును అందచేశారు. ఈ కార్యక్రమంలో మానవతా – గన్నవరం యూనిట్ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణ మూర్తి, కన్వీనర్ కర్రా వరప్రసాద రావు, కార్యదర్శి వడ్లమన్నాటి వెంకటకృష్ణ మోహన్, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమ్మె చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు



**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** రాష్ట్రవ్యాప్తంగా 123 పురపాలక సంఘాలు ఉండగా అందులో పలుచోట్ల కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరగట్లేదని అందుకే సమ్మెకు దిగవలసి వచ్చింది అంటున్నారు నాయకులు. రాష్ట్ర సిఐటియు పిలుపుమేరకు సమ్మె చేస్తున్నామని, తమ కష్టాలను ప్రజలతోపాటు రాజకీయ నాయకులు అధికారులు పట్టించుకోవాలని సూచించారు. 50వేల జీతం, 62 సంవత్సరాల కు రిటైర్మెంట్, తర్వాత ప్రభుత్వ కార్మికుల మాదిరిగానే చేతపత్యాలు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో 17 రోజులు పాటు సమ్మె నిర్వహించినప్పుడు ఆ సమ్మె కాలానికి సంబంధించిన జీతాలు అందివ్వాలని కోరారు. 55 మున్సిపాలిటీలలో కార్మికుల కష్టాలను పట్టించుకోవడంలేదని గత ప్రభుత్వం హాయంలో ఎన్నో వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకపోయిందని, ప్రభుత్వం అయినా సరే పట్టించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకుంటున్నామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, వివిధ శాఖల మంత్రులకు వినతి పత్రాలు అందించామని అయినా తమ సమస్యలను పట్టించుకోవడంలేదని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, వెంకట్రావు పలువురు కార్మికులు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎరువుల షాపులపై విజిలెన్స్ అధికారుల తనిఖీలు



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** మండలంలోని ఎరువులు, పురుగుమందుల షాప్‌లు గోదాముల్లో విజిలెన్స్, వ్యవసాయ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని సత్య లక్ష్మి వెంకటేశ్వర ట్రేడర్స్ షాపులో తనిఖీలు నిర్వహించారు. అనంతరం గోదాములో ఎరువుల నిల్వలును తనిఖీ చేసి తగు సూచనలు చేసారు. ఈ తనిఖీలో సహాయ వ్యవసాయ సంచాలకులు బుల్లి బాబు, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ పోలీస్ గోపాలకృష్ణ, మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిల తదితరులు పాల్గొన్నారు

# శాకాంబరీ దేవి అలంకారంలో పుంతల ముసలమ్మ



**నరసాపురం, మేజర్ న్యూస్ :**పట్టణంలోని 7 వార్డులోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు ఇంటి సమీపంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ పుంతల ముసలమ్మ అమ్మవారు శుక్రవారం శాకంబరీ దేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంత గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున హాజరై ప్రసాదములు స్వీకరించారు.ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు సంకు భాస్కర్ నాయుడు, మల్లాడి మూర్తి, గుగ్గిలపు బుజ్జి , కోటిపల్లి రాంబాబు, కోటిపల్లి బ్రహ్మానందం,యన్ ఆర్ కే,ఆకుల భుజంగరావు,మచ్చెట్టి శివాజీ, అడ్డగళ్ళ భాను,పులపర్తి సుబ్రమణ్యం,రావి అప్పాజీ కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రీ-సర్వే ప్రాజెక్టు ప్రజలు సహకరించాలి

**తహసిల్దార్ సునీల్ కుమార్**



**తాడేపల్లిగూడెం, మేజర్ న్యూస్:** "ఆంధ్రప్రదేశ్ రీ–సర్వే ప్రాజెక్టు"లో భాగంగా పట్టణ పరిధిలో తాడేపల్లిగూడెం, యాగర్లపల్లి,కడకట్ల రెవిన్యూ గ్రామాలలో గల వ్యవసాయ భూములకు జరుగు రి–సర్వేలో సదరు రెవిన్యూ భూములకు సంబందించిన రైతులు మీ యొక్క భూమికి సంబంధించిన విస్తీర్ణం లో ఏ విధమైన హెచ్చు తగ్గులు ఉన్నయెడల లేదా అడంగల్ నందు పట్టాదారు పేర్లు లో తప్పులు ఉన్న యెడల వాటిని, మరణించిన పట్టాదారులను వెబ్లాండ్ నందు తొలగించి వారి స్థానంలో వారికి అర్హులైన కుటుంబ సభ్యులకు మ్యుటేషన్ చేయుట నిమిత్తం మీ భూమికి సంబందించిన అన్ని హక్కు పత్రములు అనగా రిజిష్టర్ దస్తావేజుల నకలు, ఆధార్ కార్డు, పాస్ బుక్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజు ఫోటోలతో 4 రోజులో మీ పరిధిలో గల వార్డు రెవిన్యూ సెక్రటరీ (వీఆర్వో) వారిని సంప్రదించవలసినదిగా సూచించారు.

# రహదారికి మరమ్మత్తులు చేయండి







**కొయ్యలగూడెం రూరల్,మేజర్ న్యూస్ :** పల్లెల్లో రహదారులు గోతులు పడి అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. కనీసం నడక మార్గానికి కూడా అణువుగా లేకపోవడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారు. కొయ్యలగూడెం మండలం దిప్పకాయలపాడు గ్రామంలో హై స్కూల్ ప్రక్కన ఉన్న ప్రధాన రహదారి ఆర్ అండ్ బి రోడ్డు. ఊరు చివర వంతెన వరకు రహదారి మధ్యలో పెద్ద పెద్ద గోతులు పడి ఉండుటవలన కొద్దిపాటి వర్షానికి గోతులలో నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తూ ఉంటున్నాయని,తద్వారా ఎస్సీ పేట నుండిహై స్కూల్లో చదువుకొనుటకు నడిచి వెళ్లే విద్యార్థిని విద్యార్థులు బురదలో తొట్రిల్లుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

ఈ రహదారి ఏజెన్సీ గ్రామాలలైన కిచప్ప గూడెం,వంక బొత్తప్పగూడెం,సరిపల్లి, ధర్మారావుపేట,గ్రామాలకు ప్రయాణించాలంటే రోడ్డు పూర్తిగా గోతులతో ఉంటుందని గ్రామ ప్రజలు అంటున్నారు.నిత్యం ఏజెన్సీ గ్రామాల నుండి విద్య, వైద్యం,ఉపాధి,కొరకు ప్రవేట్ స్కూల్ బస్సులు విద్యార్థులతో ఈ మార్గం ద్వారానే మండల కేంద్రానికి రావలసి ఉండగా కనీసం ఆటో తిరగడానికి కూడా వీలు లేకుండా,మోటరు వెహికల్‌పై ప్రయాణించుటకు అణువుగా లేకపోవడంతో ప్రమాదాలు జరుగు తున్నాయని, స్థానిక ప్రజలు కూడా అనేక ఇబ్బందులకు గురి అయ్యామని తెలుపుతున్నారు. మండల కేంద్రానికి వైద్యం కోసం వెళ్లి రావాలంటే గర్భిణీలు, వృద్ధులు,వికలాంగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి గోతులు నైనా కంకరతో మరమ్మత్తులు చేయాలని కోరుతున్నారు.

# కృష్ణా డెల్టా శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలి



**ఏలూరు రూరల్ ,మేజర్ స్యూస్ :** కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు.శుక్రవారం మండలంలోని మాదేపల్లి,కాట్లంపూడి, లింగారావు గూడెం గ్రామాల్లో పర్యటించి ఎండిపోతున్న నారుమళ్లను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరి నారు మళ్ళు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న సాగునీటిని కేఈ కెనాల్ లోకి మళ్లించి కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత హడావుడిగా గుర్రపు డెక్కను తొలగించకుండా కలుపు మందు చల్లారని, ఈ నీటినే ఏలూరు రూరల్ మండలంలోని ప్రజలు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తారని, అత్యంత ప్రమాదకర కడుపు మందులు చల్లడం దారుణమన్నారు.గుర్రపు డెక్కను చంపేందుకు కలుపు మందు చెల్లి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో అన్నం రెడ్డి రంగారావు, సుంకర నరసింహారావు, వి.రామారావు, పి.భాస్కరరావు, టి.రంగారావు, బైరెడ్డి కృష్ణారావు పలువురు రైతులు,కౌలు రైతులు పాల్గొన్నారు.

# నేడు పట్టణంలో స్వచ్ఛ్ ఆంధ్ర ర్యాలీ

**నరసాపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశముల ప్రకారం "స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమములో భాగముగా ప్రతి నెల 3వ శనివారం నిర్వహించు కార్యక్రమములో భాగముగా శనివారం ఉదయం 9 గంటలకు స్థానిక బస్ స్టాండ్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి మెయిన్ రోడ్డు,ప్రకాశం రోడ్డు మీదుగా శివాలయం సెంటర్ లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య తెలిపారు. స్థానిక శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, చైర్ పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ ల ఆద్వర్యంలో పర్యావరణ నిబంధనలకు అనుగుణముగా అన్నీ రకముల ప్లాస్టిక్ కాలుష్యములను పూర్తి స్థాయిలో నివారించుట కై "ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ " అనే నినాధంతో అవగాహన ర్యాలీ నిర్వహించ పడుతుందని ఆయన తెలిపారు. అనంతరం ప్రతి ప్రభుత్వ కార్యాలములోని సిబ్బంది, వారి వారి పరిసరాలను, కంప్యూటర్లు, ప్రింటర్లు, బీరువాలు, ఫైల్ లను శుభ్రం చేసుకొనవలెననియు,ఆఫీసు టాయిలెట్స్ ను శుభ్రం చేయించుకోనవలసినదిగా కమిషనర్ తెలిపారు.

# ఏఎంసి చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపిన విప్ నాయకర్



**నరసాపురం, మేజర్ న్యూస్:** నియోజకవర్గంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏఎంసి చైర్మన్‌గా నియమితులైన జక్కం శ్రీమన్నారాయణ ప్రభుత్వ విప్, నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్‌ని మర్యాద పూర్వకంగా కలిసారు.

శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా బొమ్మిడి నాయకర్ శ్రీమన్నా రాయణకి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర ముఖ్యకార సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ కొల్లు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

## శాకాంబరిగా దర్శనమిచ్చిన లలితాదేవి





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెం జువ్వల పాలెం రోడ్డులోని లలితా దేవి ఆలయంలో ఆలయ కమిటీ వారు అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. మానేపల్లి శ్రీనివాస్, కోటేశ్వరరావు, పలువురు కమిటీ సభ్యులు పర్యవేక్షణలో అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో ఆకుకూరలతో అలంకరించి వివిధ దండలుగా తీర్చిదిద్ది అమ్మవారిని ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విష్ణు సహస్రనామార్చన, లలితా పారాయణం, మొదలైన పారాయణ నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఏర్పాటుచేసిన ప్రసాదాలు స్వీకరించారు.

## మహిళలపై దాడులకు పాల్పడితే సహించేది లేదు : ఎమ్మెల్యే రోషన్ హెచ్చరిక



**చింతలపూడి,మేజర్ స్యూస్ :** చింతలపూడి నియోజక వర్గంలో మహిళలపై దాడులకు పాల్పడితే సహించేది లేదని స్థానిక శాసన సభ్యులు సొంగా రోషన్ కుమార్ హెచ్చరించారు.చింతలపూడి మండలం సీతా నగరంలో బాలికపై జరిగిన దాడిపై ఎమ్ ఎల్ ఏ రోషన్ కుమార్ స్పందించారు,బాధిత బాలికకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు, కుటుం బాలలో వ్యక్తిగత కలహాలు,విభేదాలు ఉన్నంత మాత్రాన ఇలా మహిళల పైన ,బాలికల పైన దాడులకు తెగబడే వారి పై కట్టిన చర్యలు తప్పవని ఎమ్ ఎల్ ఏ అన్నారు,బాలిక పై జరిగిన దాడి ఘటన పై పోలీసులు విచారణ జరిపి ఘటనకు పాల్పడిన వ్యక్తి పై వెంటనే కఠినచర్యలు తీసుకోవాలని ఎమ్ ఎల్ ఏ చింతలపూడి పోలీసులను ఆదేశించారు.

## మాజీ కార్పొరేటర్ భర్త రాయి మంగరాజు మృతికి వైసిపి నేతలు నివాళులు





**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక 39వ డివిజన్ సుబ్బమ్మ దేవి స్కూల్ బాలయోగి వంతెన వద్ద మాజీ కార్పొరేటర్ రాయి విమల దేవి భర్త రాయి మంగరాజు స్వర్గస్థులు అయ్యారు. ఆయన భౌతి క కాయానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్చార్జి మామిళ్ళపల్లి జయప్రకాష్ (జెపి)పూల మాలలతో నివాళు లు అర్పించారు.వారి వెంట నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు, రాష్ట్ర వాణిజ్య విభాగ ప్రధాన కార్యదర్శి గంట మోహన్ రావు,కొల్లిపాక సురేష్, బసవ, సత్యనారాయణ, రమేష్,శ్యాం, స్థానిక నాయకులు నివాళులు అర్పించారు.

## 21న తపాలా కార్యాలయాల్లో ఎటువంటి లావాదేవీలు ఉండవు

**– ఐటీ 2.0 అప్లికేషన్ ప్రారంభం**

**: డిజిటల్ పరివర్తన దిశగా ముందడుగు**

**ఏలూరు,మేజర్ స్యూస్ :** తపాలా శాఖ , డిజిటల్ ఎక్సలెన్స్ ,దేశ నిర్మాణం దిశగా చేసిన ప్రయాణంలో మరో ముఖ్యమైన మైలురా యిగా, నెక్స్ట్ జనరేషన్ ఎపిటి అప్లికేషన్ ను ప్రారంభించడాన్ని గర్వంగా ప్రకటిస్తోంది. ఈ రూపాంతరాత్మక కార్యక్రమంలో భాగంగా ఈ ఆధునికీకృత వ్యవస్థను ఈ నెల 22వ తేదీ ఏలూరు డివిజన్‌లోని అన్ని తపాలా కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్ ఎస్.శ్రీకర్ బాబు శుక్రవారం తెలిపారు. ఈ ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌కి సురక్షితంగా మరియు సజావుగా మారడానికి ఈ నెల 21వ తేదీ సోమవారం ప్రణాళికాబద్ధమైన డౌన్‌టైం షెడ్యూల్ చేయబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా 21వ తేదీ తపాలా కార్యాలయాల్లో ప్రజలకు ఎటువంటి లావాదేవీలు అందుబాటులో ఉండవు. ఇది డేటా మైగ్రేషన్, సిస్టమ్ ధృవీకరణలు,కాన్ఫిగరేషన్ ప్రక్రియలను సులభతరం చేయటానికి,కొత్త సాఫ్ట్వేర్ విజయ వంతంగా పూర్తి చేయడానికి ఈ సేవలను నిలిపివేయటం అవసరం అయ్యింది.

### నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

**పెదవేగి,మేజర్ న్యూస్:** జవహర్ నవోదయ విద్యాలయ పెదవేగి నందు 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ పరశురామయ్య పేర్కొన్నారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జవహర్ నవోదయాలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2014వ సంవత్సరం నుండి 2016 వ సంవత్సరం మధ్యలో జన్మించి ఉండాలని,మూడవ తరగతి నుండి 5వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. విద్యార్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని,ఈ నెల 29వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని,ప్రవేశ పరీక్షను 2025 సంవత్సరం డిసెంబర్ 13వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# శక్తి యాప్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**ఏలూరు,మేజర్ స్యూస్ :** జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్,డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ ఆదేశాలపై ఏలూరు 3 టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర రావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు మహిళా దళ సభ్యులు మహిళా భద్రతకు శక్తి యాప్ పై అవగాహనను శ్రీ విద్యాలయ జూనియర్ కాలేజీలో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ, శక్తి యాప్ మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో భద్రత కల్పించేందుకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ రూపొందించిన వినూత్న మొబైల్ అప్లికేషన్ అని తెలియజేశారు. ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే సమీప పోలీస్ సాయం అందుతుంది. జిపిఎస్ ద్వారా లొకేషన్ పంపించబడుతుంది. 112,100,181 వంటి హెల్ప్‌లైన్ నంబర్లకు యాప్ నుంచే కాల్ చేయవచ్చుస్నేహితులు,కుటుంబ సభ్యులతో లైవ్ లొకేషన్ షేర్ చేయవచ్చువేధింపులు, కిడ్నాప్, గృహ హింస వంటి పరిస్థితుల్లో ఉపయోగించవచ్చు ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్,అపిల్ యాప్ స్టోర్ శక్తి ఆంధ్ర పోలీసు అని సెర్చ్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఈ అవగాహన కార్యక్రమం ద్వారా మహిళ లు, బాలిక భద్రతపై నమ్మకాన్ని పెంపొందించడం లక్ష్యంగా పోలీసులు కృషి చేస్తున్నారు అని 3 టౌన్ ఇన్స్పెక్టర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు తెలిపారు.

# వైసిపి పాలనలో ప్రభుత్వ యంత్రాంగం దుర్వినియోగం

**– మాజీ మంత్రి 'కొట్టు 'పై జనసేన నాయకుల ఆగ్రహం**




**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు,యంత్రపాటి రాజు,నీలపాల దినేష్ యాదవ్, మైలవరపు రాజేంద్రప్రసాద్, సోమ శంకరరావు మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో వైసీపీ పార్టీ నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలతో చెప్పు దెబ్బలు తినే సమయం ముందుగా గ్రహించి గ్రామాలలోకి వెళ్లే ధైర్యం చేయలేకపోతున్నారని అన్నారు. గత వైసిపి ప్రభుత్వ పాలనలో ఐదు సంవత్సరాల పాటు నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి పనులు లేకుండా స్వార్థానికి ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. రోడ్ల విస్తరణ పనులు, బ్రిడ్జి నిర్మాణాలు,సామాన్యుల గృహ నిర్మాణాలు వంటి అనేక పనులకు పర్సంటేజ్‌తో అభివృద్ధిని కుంటు పడేలా చేశారని అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ వచ్చినప్పటి నుండి నేటి వరకు వెనుతిరిగి చూడకుండా అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. సొంత క్యాడర్ నాయకులను మోసం చేసిన ఘనత కొట్టు సత్యనారాయణకు దక్కుతుందని అన్నారు.

గెలిచిన సంవత్సరంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహం రాష్ట్ర ప్రభుత్వం ఆదరణతో కోట్లాది రూపాయలను వెచ్చించి రైల్వే అభివృద్ధి పనులు, క్రికెట్ స్టేడియం, ఇండోర్ స్టేడియం,స్విమ్మింగ్ పూల్‌వంటి అధునాతన ప్రయోజనాలను నియోజకవర్గ ప్రజలకు అందించిన ఘనత ఒక్క బొలిశెట్టి శ్రీనివాస్‌కు దక్కుతుందని అన్నారు. బొలిశెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పై నడిపిస్తుంటే వారిపై కొట్టు సత్యనారాయణ విమర్శలు చేయడం తగదని అన్నారు.

# పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే చింతమనేని





పెదవేగి,మేజర్‌న్యూస్ : పేద ప్రజల అభ్యున్నతి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పెదవేగి మండలంలోని కొండలరావు పాలెం,రాట్నాలకుంట రాయన్నపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే చింతమనేని పర్యటించారు.తమ గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి వాడవాడలా ప్రజలు ఎంతో అభిమానాన్ని చూపుతూ పూలమాలలతో, మహిళల మంగళ హారతులతో స్థానిక కూటమి నాయకులు,కార్యకర్తలు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు.గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా ప్రజలకు అందించారు. అదేవిధంగా ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అనే అంశాన్ని కూడా తెలుసుకుంటూ వాటిని నమోదు చేసుకుంటూ సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పెద్ద ఎత్తున అధికారులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



# బురద రోడ్డును సిసి రోడ్డుగా నిర్మించండి

**– చుట్టూ కార్యాలయాలు,గిరిజన బాలుర వసతి గృహం మధ్యలో గతుకుల రోడ్డు**

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** చుట్టూ కార్యాలయాలు, ఒకపక్క గిరిజన బాలుర వసతి గృహం, మరోపక్క గిరిజన బాలుర పాఠశాల మధ్యలో బురద రహదారి. వర్షాకాలం వస్తే కార్యాలయాలకు వెళ్లే వారికి వసతి గృహంలోని విద్యార్థులకు అక్కడికి వచ్చే తల్లిదండ్రులకు బురద రహదారి కంపుతో దర్శనమిస్తుంది. వర్షం కురిస్తే నీరంతా ఈ రహదారిపై నిల్వ ఉండడంతో దానిలో వాహనాలు తిరిగి బురదమయంగా మారి కుళ్ళిన కంపు వెదజల్లుతూ పంట కాలువ మాదిరిగా తయారవుతుందని స్థానికులు విద్యార్థులు పేర్కొంటున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చుట్టూ ఉన్నవారు దుర్వాసన తట్టుకోలేకపోతున్నట్లు వెల్లడిస్తున్నారు. ఉన్నత అధికారులు ఈ రహదారిని సిసి రహదారి గా మార్చండి అంటూ వేడుకుంటున్నారు.

# స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించండి

**– ప్రజలపై వేస్తున్న అదనపు విద్యుత్ భారాలను తక్షణమే ఆపాలి**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజా ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆర్ఆర్ పేట స్ఫూర్తి భవన్ నందు ఉప్పులూరి హేమ శంకర్,కే శ్రీనివాస్,యర్రా శ్రీనివాస్ అధ్యక్ష వర్గంగా విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకిస్తూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి,యు వెంకటేశ్వరరావు,సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్విడి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని పిలుపునిచ్చి ఎన్నికల్లో గెలిచిన తర్వాత అదానీ అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని విమర్శించారు.గత ఐదేళ్లలో పరిపాలించిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో తెలుగుదేశం పార్టీ బాదుడే బాదుడు అంటూ కార్యక్రమాలు చేసిన తెలుగుదేశం నేడు ప్రజలపై అదే బాదుడు చేయడం విచారకరమని అన్నారు. ఐఎఫ్టియు ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని స్మార్ట్ మీటర్లు బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కూరెళ్ల వరప్రసాద్,కార్యవర్గ సభ్యులు కొల్లూరి సుధారాణి,గొర్లి స్వాతి,ఎంఏ హకీమ్,ఉప్పులూరి లక్ష్మి ,భవాని,రాజామణి, మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు కొండేటి బేబీ,లక్కోజు జగదీశ్వరి మెకానికల్ యూనియన్ కోశాధికారి కాటూరి శ్రీధర్, వెంకట రావు,ఐఎఫ్టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి, మంగరాజు రాము, మీసాల వెంకటరమణ, కోరాడ అప్పారావు, ధనాని విజయ్, సూరిబాబు, దుర్గారావు,మజ్జి శ్రీను, త్రినాదు, లక్ష్మణ్, రావులమ్మ రావులమ్మ, సరోజిని, లక్ష్మి, పద్మ, దమయంతి, సీమమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ,ఎం ఇసాక్, ఎస్ సత్యనారాయణ, కోటేశ్వరరావు, చేతివృత్తుదారుల సమన్వయ కమిటీ నాయకులు పి ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

# ఛాంబర్స్ ఎన్.సి.సి విద్యార్థిని ధనలక్ష్మికి సిల్వర్ మెడల్



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** స్థానిక బిఆర్ఆర్అండ్ జికే ఆర్ ఛాంబర్స్ డిగ్రీ , పీజీ కళాశాలలో బీఎస్సీ డేటా సైన్స్ రెండవ సంవత్సరం చదువుతున్న ఎస్ ధనలక్ష్మి నేషనల్ లెవెల్ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్ షిప్ మోడలింగ్లో విజయం సాధించి సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నదని కళాశాల చైర్మన్ కెవిఆర్ నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో పుష్పకృత్యంతో ఎస్ ధనలక్ష్మిని కళాశాల యాజమాన్యం సత్కరించినది.ఈ సందర్భంగా కళాశాలచైర్మన్ కె.వి.ఆర్ నరసింహా రావు మాట్లాడుతూ తమ కళాశాల ఎన్సిసి విద్యార్థులు జాతీయ కామ రాష్ట్రీయ ఎన్సిసి క్యాంపులకు హాజరగుట ద్వారా జాతి సమగ్రతను అలవర్చుకుంటున్నారని అన్నారు.కళాశాల సెక్రటరీ కే.సీతారామరాజు మాట్లాడుతూ దేశ సేవ క్రమశిక్షణ విద్యార్థి దశలో నాయకత్వ లక్షణాలను ఎన్సిసిలో నేర్పించుట జరుగుతుందని తెలిపారు.కళాశాలప్రిన్సిపాల్‌డాక్టర్ డి. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ధనలక్ష్మి కేరళలో జరిగే జాతీయస్థాయి పోటీకి ఎంపికైనట్లు అక్కడ ఎంపిక అయితే వచ్చే జనవరిలో జరిగే రిపబ్లిక్ డే సంబరాలకు ఎన్సిసి వింగ్ తరపున మార్చ్ ఫాస్ట్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ ప్రవీణ్ భాను చాంబర్స్ సెక్రెటరీ కటారి నాగేంద్ర కుమార్‌కళాశాలఎన్సిసిఆఫీసర్ రవి కృష్ణ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# జీలుగుమిల్లి విద్యార్థి పవన్ కుమార్ ట్రిబుల్ ఐటీకి ఎంపిక



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** జీలుగుమిల్లి గ్రామానికి చెందిన విద్యార్థి కలపర్తి సాయి పవన్ కుమార్ ట్రిబుల్ ఐటీకి ఎంపిక కావడంపై ప్రజాప్రతినిధులు అధికారులు గ్రామస్తులు అంబేద్కర్ యూత్ సభ్యులు విద్యార్థి పవన్ కుమార్ ని అభినందించారు. గురువారం నూజివీడు లో జరిగిన కౌన్సిలింగ్ లో ఒంగోలు ట్రిబుల్ ఐటీ కి ఎంపికైనట్లు విద్యార్థి తండ్రి కలపర్తి శ్రీనివాస్ తెలిపారు. జీలుగుమిల్లి జిల్లా పరిషత్ హై స్కూల్లో చదివిన పవన్ కుమార్ కు 10వ తరగతిలో 568 మార్కులతో మండలం టాపరుగా నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థి కలపర్తి సాయి పవన్ కుమార్ కి ట్రిబుల్ ఐటీలో సీటు రావడంతో పలువురు అభినందనలు తెలిపారు. వారిలో పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు,జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ విద్యార్థి పవన్ కుమార్ ని అభినందించారు.మండల విద్యాశాఖ అధికారి కె శ్రీనివాస్,జీలుగుమిల్లి హై స్కూల్ హెచ్ఎం చంద్రావతి, గ్రామ పెద్ద బొంతు వెంకటేశ్వరరావు, అంబేద్కర్ యూత్ సభ్యులు దారా మనోజ్, తలారి సతీష్, బొంతు రామకృష్ణ, బొంతు సీతా రామాంజనేయులు, న్యాయవాది జువ్వాల బాబ్జి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

# ప్రతి 3వ శుక్రవారం బాల్యవివాహ నిరోధక కమిటీ సమావేశం



**పాలకోడేరు మేజర్ న్యూస్:** నెలలో ప్రతి 3వ శుక్రవారం గ్రామాల్లో బాల్యవివాహ నిరోధక కమిటీ సమావేశం నిర్వహించాలని సిడిపిఓ వాణి విజయరత్నం అన్నారు. వేంద్ర గ్రామంలో సర్పంచ్ కడలి నాగేశ్వారి అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా శిశు సంరక్షణ అధికారి రాజేష్ మాట్లాడుతూ జిఓ నెంబర్ 39,31 జిఓలను తప్పక పాటించాలని అన్నారు బాల్యవివాహములను నిరోధించటమే కాకుండా బాలల సంరక్షణ గురించి కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలని తెలిపారు ఈ సమావేశంలో వేంద్ర కార్యదర్శి జి కృష్ణమోహన్ వీఆర్వో జి మధు సుధనరావు అంగన్వాడీ సూపర్ వేజర్ కరుణ ఎంఎల్హెచ్‌పిలు ఎఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# 20న పాలకొల్లులో దివ్యాంగుల ఉచిత ఉపకరణాల ఎంపిక,గుర్తింపు

### సెయిల్ నుండి రూ.50లక్షల సిఎస్ఆర్ నిధులు మంజూరు చేయించిన కేంద్రమంత్రి వర్మ

**భీమవరం,మేజర్‌న్యూస్ :** దివ్యాంగుల కోసం అవసరమైన ఉచిత ఉపకరణాల ఎంపిక గుర్తింపు శిబిరాన్ని ఈనెల 20వ తేదీన పాలకొల్లులో నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. తాను బాధ్యత నిర్వర్తిస్తున్న ఉక్కు మంత్రిత్వ శాఖకు చెందిన శైల్ నుండి 50 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులను ఈ కార్యక్రమం కోసం మంజూరు చేయించడం జరిగిందన్నారు. ఆదివారం పాలకొల్లులోని మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో అలింకో సంస్థకు చెందిన ప్రత్యేక వైద్య బృందం పాల్గొని సేవలందిస్తారన్నారు.ఈశిబిరం ద్వారా దివ్యాంగులకు అందించవలసిన ఉచిత ఉపకరణాలను డాక్టర్ల బృందం గుర్తించడం జరుగుతుందని, త్వరలో అర్హులకు కృత్రిమ అవయవాలు,



వాకర్లు , ట్రైసైకిల్ , వీల్‌చైర్ , హియరింగ్ ఎయిడ్ ,క్రచ్‌లు ,కృత్రిమ కాలు, అంధుల కోసం స్టిక్‌లు, చెవి వినికిడి పరికరాలు,బ్యాటరీ ట్రైసైకిల్,రోలేటర్లు,ఎంఎస్ క్రీప్స్ , అందుల కోసం చేతి వాచ్ లు,అంధుల చేతి కర్రలు, లెప్రసీ బాధితుల వాకింగ్ పరికరాలు,క్రచ్‌లు , ఎం.యస్.డబ్ల్యు.డి క్లిప్స్,స్పైనల్ చెయిర్స్ తదితర పరికరాలను అందిస్తామన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని రానున్న 2 నుండి 3 వారాల్లో అన్ని నియోజకవర్గాల్లో విడతల వారీగా దివ్యాంగుల కోసం ఉచిత ఉపకరణాల ఎంపిక గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నారు అని శ్రీనివాస వర్మ తెలిపారు. ఇలా గుర్తించిన తరువాత, ప్రతి ఒక్కరికి కావలసిన పరికరాలను వారికి అనుగుణంగా తయారు చేయించి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. పాలకొల్లులో ఆదివారం నిర్వహిస్తున్న ఉపకరణాల ఎంపిక, గుర్తింపు శిబిరాన్ని స్థానిక దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కోరారు.

# సన్న బియ్యం ఇస్తున్నాం - నూరు శాతం బడి భోజనం చేయాల్సిందే

### - ఎం,డి ఎం,ఎస్ ఎస్ సమన్వయకర్త కె.కృష్ణారావు



పాలకొల్లు,మేజర్ న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పోషక విలువలతో కూడిన రోజువారీ మెనూతోపాటు వారానికి ఐదు కోడిగుడ్లు,మూడు రోజులు చిక్కిలు, మూడు రోజులు చిక్కిలతో పాటు రుచికరమైన పోషక విలువలు కల సన్నబియ్యం ఇస్తుందని పాఠశాలకు హాజరైన అందరు విద్యార్థులు బడి భోజనం చేయాలని మధ్యాహ్న భోజన ,పాఠశాల పారిశుధ్య జిల్లా సమన్వయకర్త కె. కృష్ణారావు అన్నారు. స్థానిక కొత్తపేట స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను కృష్ణారావు ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన తయారీ బియ్యం గుడ్లు, చిక్కిలు,రాగిజావ నిల్వలు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. మంచినీటి ఫిల్టర్ రిపేర్ చేయించాలని న్యూట్రి గార్డెన్ లో కూరగాయలు ఆకుకూరలు పండించాలని ఇందు నిమిత్తం బడి తోట ఉన్న పాఠశాలకు సంవత్సరానికి 5 వేల రూపాయలు ఇస్తుందని కృష్ణారావు తెలియచేశారు.విద్యార్థులందరూ యూనిఫామ్,బెల్ట్,బ్యాగ్,షూ తో పాఠశాలకు రావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రాంత్ విజయ్ జి.వి.ఎస్.వి.ఆర్.ఎం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భవాని ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పి4 అమలులో అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి

### - బంగారు కుటుంబాల కోసం దాతలు ముందుకు రావాలి





కాళ్ళ,మేజర్‌న్యూస్ : పేదరిక నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన పి4 కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాళ్ల మండలం బొండాడ గ్రామంలో పి4 గ్రామసభను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఇప్పటికే బొండాడ గ్రామంలో గుర్తించిన 128 బంగారు కుటుంబాలకు సంబంధించిన డేటాను గ్రామ సెక్రెటరీ గ్రామసభలో పేరుపేరునా చదివి వినిపించగా, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వారి స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నాను.ఈ సందర్భంలో అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. బంగారు కుటుంబాలు జాబితాలో అనర్హులకు చోటు కల్పించకపోవడం ఎంత ముఖ్యమో, అర్హులను జాబితాలో చేర్చడం అంతే ముఖ్యం అన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, చదువుకుంటున్న పిల్లలు, ఏ ఆధారం లేని పెద్దలు, మధ్య వయసులో ఉండి ఆర్థికంగా వెసులుబాటు లేని కుటుంబాలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047లక్ష్యసాధనలో భాగంగా పి4 (పబ్లిక్, ప్రైవేట్,పీపుల్, పార్ట్నర్షిప్) కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు.జిల్లాలో పేదరిక నిర్మూలనలో పి4 కార్యక్రమం కీలకంగా వ్యవహరించనున్నదని, పూర్తిస్థాయిలో అమలు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన సమస్యలు,సలహాలు సూచనలు తెలియజేయాలని కోరారు.ఈ సమావేశంలో సిపిఓ కె.శ్రీనివాసరావు, గ్రామ వార్డు సచివాలయాల అధికారి వై. దోశి రెడ్డి, డ్వామా పిడి మరియు పి4 స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ కే సిహెచ్ అప్పారావు,ఎంపీడీవో జి.స్వాతి, గ్రామ సర్పంచ్ మన్నే వరలక్ష్మి,పంచాయతీ సెక్రటరీ బాలకృష్ణ,వైస్ ఎంపీపీ మన్నె శ్రీనివాస్,మార్కెట్ యార్డ్ చైర్మన్ నాగరాజు, స్థానిక నాయకులు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



**భీమవరం,మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ డీఎంహెచ్ఓ జి.గీత భాయ్ నేతృత్వంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పశ్చిమ గోదావరి సంయుక్తంగా ఒక రక్తదాన శిబిరంను నిర్వహించింది. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,వివిధ ఎన్‌జీఓల ప్రతినిధులు ఈ శిబిరంలో ఉత్సాహంగా పాల్గొని అందరికీ ప్రేరణగా నిలిచారు. జిల్లాలో ప్రజారోగ్య సంరక్షణతో పాటు, వారు స్వయంగా రక్తదానం చేయడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.ఈ శిబిరంలో భీమవరం,తణుకు రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ల ద్వారా మొత్తం 25 యూనిట్లు రక్తం సేకరించబడింది. డీఎంహెచ్ఓ శ్రీమతి గీత భాయ్ గారు రక్తదానంలో పాల్గొన్న సిబ్బందిని అభినందిస్తూ, వారి సేవా స్ఫూర్తి ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సిఎస్ చైర్మన్ ఎం.ఎస్.వి.ఎస్. భద్రి రాజు, వైస్ చైర్మన్ వాబిలిశెట్టి కనక రాజు,డిస్ట్రిక్ట్ లెప్రసీ ఆఫీసర్ డా.రవి, డిస్ట్రిక్ట్ ఎస్ఎసిఎస్ ఆఫీసర్ మధు,ఐఆర్‌సిఎస్ సభ్యుడు జి.ఎం.కృష్ణ రావు పాల్గొన్నారు. రక్తదాతలకు గుర్తింపుగా ధృవపత్రాలు అందజేయబడినాయి.ఈ తరహా కార్యక్రమాలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సేవా దృక్పథాన్ని ప్రతిబింబిస్తూ, ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా నిలుస్తున్నాయి.

# కరెంట్ షాక్ గురై వ్యక్తికి తీవ్ర గాయాలు



కామవరపుకోట,మేజర్‌న్యూస్ : కోకో కాయలు కోస్తున్న కూలి ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురయ్యాడు. ఘంటావారి గూడెం నికి చెందిన ఆర్ రాంబాబు శుక్రవారం స్థానికంగా ఉన్న కోకో తోటలో కోకో కాయలు కోస్తున్న సమయంలో అతని ఇనుప కత్తి విద్యుత్ లైన్‌కు తగిలింది. దీంతో అతనికి కరెంట్ షాక్ గురై అతను తీవ్ర గాయాలు పాలయ్యాడు. అతన్ని వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉంది.

# మానవ వనరులను యువత వినియోగించుకోవాలి




**ఏలూరు,మేజర్ న్యూస్ :** జీవితం పని స్థిరమైన అభివృద్ధి కోసం అభ్యాసం నైపుణ్యాలు అనే అంశాలపై దృష్టి సారించి మానవ వనరులను సరైన రీతిలో ఉపయోగించుకోవడం ద్వారా యువతలో నైపుణ్యాలను వెలికి తీయడమే అంతర్జాతీయ యువ నైపుణ్య దినోత్సవం ముఖ్య ఉద్దేశం సెయింట్ థెరిసా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ మెర్సీ అన్నారు. స్వయం ప్రతిపత్తి కళాశాలలో జరిగిన అంతర్జాతీయ యువ నైపుణ్య దినోత్సవ వేడుకలలో కళాశాల ప్రిన్సిపల్ ప్రసంగించారు.యువతకు ఉపాధి, చదువుకు తగ్గ మంచి పని, వ్యవస్థాపకత కోసం విద్యార్థులలో నైపుణ్యాలు వెలికి తీయవచ్చుని ఆమె సూచించారు. కామర్స్ విభాగాధిపతి ఎస్.బి.వి. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ యువత నైపుణ్యాలే సమాజాభివృద్ధికి చుక్కాని అన్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డా. సిస్టర్.మెర్సి.ప్రథమ ద్వితీయ తృతీయ తృతీయ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమాన్ని కామర్స్ విభాగ అధ్యాపకులు. జగదీశ్వరి,హారిక,లావణ్య నిర్వహించారు.ఈ కార్యక్రమ నిర్వాహకులను కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా. సిస్టర్ సునీలారాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా.సిస్టర్ సుశీల,ఇతర అధ్యాపకులు అభినందించారు.